
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 158 | ది.24-8-2024 | విజయవాడ | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## టాప్ 5 సీఎంల జాబితాలో చంద్రబాబు



**అమరావతి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో 'ఇండియా టుడే – సీ ఓటర్' దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నాలుగో స్థానంలో నిలిచారు. ఏపీ సీఎం చంద్రబాబు ఐదో స్థానంలో ఉన్నారు. అత్యంత జనాదరణ పొందిన సీఎంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తొలి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మూడో స్థానంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల సమయంలోనే టాప్ 5 ముఖ్యమంత్రుల జాబితాలోకి చంద్రబాబు రావడం విశేషం.

## ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు- ప్రతీ పేదకు సొంత ఇల్లు : సీఎం చంద్రబాబు

● వచ్చే ఐదేళ్లలో ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తాం - సీఎం చంద్రబాబు



**అంబేద్కర్ కోనసీమ జిల్లా/వానపల్లి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లిలో గ్రామసభకు సీఎం హాజరయ్యారు. వానపల్లిలోని పళ్లాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఇల్లు లేని పేద ఉండకూడదని ప్రతి కుటుంబానికి గూడు కట్టిస్తామని హామీ ఇచ్చారు. 'స్వర్ణ గ్రామపంచాయతీ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్త పేట మండలం వానపల్లిలో సీఎం పర్యటించారు. ఈ క్రమంలో చంద్రబాబుకు ఉమ్మడి తూ.గో. జిల్లా నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ క్రమంలో సీఎం వానపల్లిలోని పళ్లాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వానపల్లి గ్రామసభలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో 'గ్రామ సభలు' పెట్టామని సీఎం అన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ వానపల్లి గ్రామసభకు హాజరై ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 13,326 పంచాయతీల్లో గ్రామసభలు పెట్టాని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ఏడాది నరేగా కింద రూ.4,500 కోట్ల పనులకు అనుమతి తీసుకున్నామని నరేగా కింద వంద రోజులు పని కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఈ పథకం కింద ఈ ఏడాది 84లక్షల కుటుంబాలకు పని దొరుకుతుందని సీఎం తెలిపారు. పేద ప్రజలకు న్యాయం జరిగే పాలనకు శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నాకు. 2014-19 మధ్య గ్రామాభివృద్ధికి స్వర్ణయుగమని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల మహిళలు ఇబ్బంది పడ్డారని వైఎస్సార్?సీపీ సభలకు వెళ్లినవారు బయటకు వెళ్లకుండా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. గ్రామాభివృద్ధిలో సర్పంచి పాత్ర కీలకమని సీఎం తెలిపారు. వైఎస్సార్?సీపీ ప్రభుత్వంలో నరేగా నిధులు నేతల జేబుల్లోకి వెళ్లాయని అన్నారు. 2014-19 మధ్య 27,444 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లు వేశామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. గ్రామాల్లోని పేదలకు ఇళ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఇళ్లకు విద్యుత్, సురక్షిత తాగునీరు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని తెలిపారు. వైఎస్సార్?సీపీ భూతాన్ని పూర్తిగా భూ స్థాపితం చేస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి ఎలా కల్పించాలనే ఎప్పుడూ ఆలోచిస్తున్నానని ఇంతా 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సంపద సృష్టించి పేదలకు పంచుతా. ఈ విషయంలో రాజీ లేదు. గత ఐదేళ్లలో ఉద్యోగులు, పింఛనుదారులకు జీతం సరిగా వచ్చేది కాదు. పేదవాడికి రూ.15కే మూడుపూటలా భోజనం పెడుతున్నాం. నైపుణ్యం ఉంటేనే యువత ఆదాయం పెరుగుతుంది. చీడపీడల నివారణకు ఆధునిక సాంకేతిక పరికరాలు వచ్చాయి. ప్రస్తుతం 12 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాధ్యం జరుగుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలు వేయాలి. పంటలకు ఎరువులు, పురుగుమందులు బాగా తగ్గించాలి.

## జాతీయ.. అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణకు అవకాశం ఇవ్వండి...

● స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఆర్థిక సహాయం అందజేయండి.. ● క్రీడా సంస్థల అప్‌గ్రెడేషన్ డీపీఆర్‌లను ఆమోదించండి... ● కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



**ఢిల్లీ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులన్నీ తెలంగాణలో ఉన్నాయని, భవిష్యత్తులో నిర్వహించనున్న ఒలింపిక్స్‌తో పాటు ఇతర అంతర్జాతీయ, జాతీయ క్రీడలు నిర్వహించే అవకాశాన్ని తెలంగాణకు ఇవ్వాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి మాండవీయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా క్రీడా శాఖపై తమకున్న లక్ష్యాలను, ఆకాంక్షలు, తెలంగాణకు ఉన్న ఘనతను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఒలింపిక్స్‌తో పాటు పలు అంతర్జాతీయ క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించిన విషయాన్ని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడానికి అవసరమైన అన్ని వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, సరూర్ నగర్ స్టేడియం, ఎల్బీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, ఓయూ క్యాంపస్, జింఖానా గ్రౌండ్, హుస్సేన్ సాగర్ తదితరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలు, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్స్, షూటింగ్ రేంజ్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్ స్పోర్ట్స్ (Rowing, Kayaking and Canoeing) ఇతర క్రీడలకు వసతులు ఉన్నాయని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో వివిధ కేటగిరిల ఫైవ్ స్టార్ హోటళ్లు ఉన్నాయని, విమాన, రైలు సర్వీసులతో అనుసంధానమై ఉందని తెలిపారు. 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, 2007లో ప్రపంచ మిలటరీ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించిన విషయాన్ని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి గుర్తు చేశారు. వీటన్నింటని పరిగణనలోకి తీసుకొని భవిష్యత్‌లో ఒలింపిక్స్, ఆసియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ తెలంగాణలో నిర్వహించే అవకాశం ఇప్పించాలని, 2025, జనవరిలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కు హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్పోర్ట్స్ యూనివర్సిటీల్లో అన్ని రకాల క్రీడలకు సంబంధించిన శిక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు.

## గ్రామ స్వరాజ్యం - గ్రామ చైతన్యం లక్ష్యంగా పాలన

● గ్రామాలకు కావాల్సిన సదుపాయాలపై నేడే తీర్మానం చేసుకుందాం ● ఉపాధి హామీ పథకం గ్రామాలకు కల్పతరువు లాంటిది ● గ్రామ పంచాయతీల నిధులు లాక్కుని జగన్ గ్రామాలను నాశనం చేశాడు ● వచ్చే ఐదేళ్లలో ఏం చేయాలో ఇప్పుడే జాబితా సిద్ధం చేస్తున్నాం ● సమస్యల్లేని గ్రామాలలే లక్ష్యంగా గ్రామ సభలన్న మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** సమస్యల్లేని గ్రామాలే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం మండలంలోని భోగిరెడ్డిపల్లి, చిన్నాపురం, తాళ్లపాలెంలో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొన్నారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాటు గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశాడని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చే ఐదేళ్లు గ్రామాల్లో ఏమేం అభివృద్ధి పనులు కావాలో తెలుసుకుని తీర్మానం చేసేలా గ్రామ సభలకు శ్రీకారం చుట్టిందన్నారు.

**గాంధీజీ లక్ష్యాలకు అనుగుణంగా పాలన..** రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించడం రికార్డు అన్నారు. గ్రామ స్వరాజ్యం కావాలని నాడు గాంధీజీ కోరుకున్నారు. నేడు గాంధీజీ లక్ష్యాన్ని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గ్రామాలు బాగుపడాలంటే గ్రామస్తుల్లో చైతన్యం కూడా అత్యంత అవసరం అన్నారు. అందుకే గ్రామ స్వరాజ్యం.. గ్రామ చైతన్యం లక్ష్యంగా పాలనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో ఏం అభివృద్ధి జరిగిందో.. వచ్చే ఐదేళ్లు ఏం చేయాలో జాబితా సిద్ధం చేసుకుని ముందుకు వెళదాం అన్నారు.

**ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుందాం..** గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కల్పతరువు లాంటిది. ఆ పథకం కింద కేంద్రం నుండి వచ్చే నిధుల్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలి. ఇప్పటికే జిల్లాకు రూ.160 కోట్ల వరకు ఉపాధి హామీ నిధులు వచ్చాయని, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో గ్రామ సభల్లో తీర్మానించుకోవాలని సూచించారు. 2014 -19 మధ్య కాలంలో 32 శాఖల్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానించాం. దాదాపు 25 వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్లు వేశాం. లక్షలాది ఎల్ఈడీ విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసుకున్నాం. గ్రావెల్ రోడ్లు, స్కూల్ కాంపౌండ్ వాల్స్, అంగన్‌వాడీ భవనాలు సహా అనేక అభివృద్ధి పనులు ఉపాధి నిధులతోనే చేసుకున్నాం. కానీ, గత ఐదేళ్ల కాలంలో రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదు. ఎక్కడా చిన్న అభివృద్ధి జరగలేదు. అందుకే సమస్యల్లో కొట్టు మిట్టాడుతున్న గ్రామాలను అభివృద్ధిలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా నేడు గ్రామ సభల ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు

**ప్రతి ఇంటికీ సురక్షిత నీరిచ్చే బాధ్యత తీసుకుంటా..** ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని, ఆ మేరకు పనులు మొదలు పెట్టామన్నారు. మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 95శాతం పనులు పూర్తి చేశామని, త్వరలోనే గ్రామాల్లో కూడా పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ కింద మచిలీపట్నం నియోజకవర్గంలో పనులు చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నాటికి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. నీటి కోసం బిందెలు పట్టుకోవాల్సిన అవసరం లేకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు.

**నియోజకవర్గాన్ని దేశానికి మోడల్‌గా మారుస్తా..** నియోజకవర్గంలో డ్రైనేజీలు, వీధి దీపాల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ల ఏర్పాటుతో అభివృద్ధికి నిర్వచనం చూపుతామన్నారు. చెత్త నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తాం. హార్టీ కల్చర్, సెరీకల్చర్, పశువుల కోసం షెడ్ల ఏర్పాటు, మినీ గోకులాలు వంటి వాటికి కేంద్రం నుండి అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నుండి అందే తోడ్పాటును అందిపుచ్చుకోవడం ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

**ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపిస్తాం..** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్ద పీట వేస్తున్నాం. జగన్ రెడ్డి రూ.1000 పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు తీసుకున్నాడు. కానీ.. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం రూ.4000 పెన్షన్ అందించారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకూ అమలు చేస్తూ రూ.7000 తొలి నెలలోనే అందించారు. దివ్యాంగులకు రూ.6000, మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు పెన్షన్ ఇచ్చిన ఘనత చంద్రబాబుది మాత్రమేనన్నారు. 16,800 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ అమలుకు సిద్ధమయ్యాం. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ రద్దు చేశాం. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. త్వరలోనే మిగిలిన పథకాలు కూడా అమలు చేసి చూపిస్తాం. ఎన్ని కష్టాలున్నా హామీలన్నీ అమలు చేసేందుకు కట్టుబడి పని చేస్తున్నాం. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఉద్యోగాల్లేవు, ఉపాధి అవకాశాల్లేవు. కంపెనీలను తరిమేశారు. కల్తీ మద్యం తీసుకొచ్చి ప్రజల ప్రాణాలు తీశాడు. గంజాయితో యువత జీవితాలను ఛిద్రం చేశాడు. గతంలో స్కూల్ సమీపంలో మిఠాయిలు దొరికితే నేడు గంజాయి దొరికే పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల నుండి ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## చంద్రబాబు వద్ద నేర్చుకోవాలనే తపన నాకుంది

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



**రైల్వేకోడూరు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. గ్రామాలకు ఏం కావాలనేదానిపై చిత్తశుద్ధితో ఆలోచిస్తేనే మంచి జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, స్వర్ణ గ్రామాలు చేసుకోవాలనేదే లక్ష్యమన్నారు. గ్రామాలు పచ్చగా ఉంటే మనమంతా హాయిగా ఉంటామన్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లెలో 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరిట నిర్వహించిన గ్రామ సభలో పవన్ పాల్గొని మాట్లాడారు.

**గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది :** "గ్రామాభివృద్ధికి ఏం చేయాలన్న అంశంలో గ్రామసభ చాలా ముఖ్యం. ఉన్న నిధులను కూడా దారి మళ్లించిన పరిస్థితి గతంలో చూశాం. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీని బలోపేతానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. 13,326 పంచాయతీలు బలపడితే రాష్ట్ర అప్పులన్నీ తీర్చగలం. బాధ్యతల నుంచి మేం పారిపోం.. నిరంతరం పనిచేస్తాం. అద్భుతాలు చేయడానికి చేతిలో మంత్రదండం లేదు.. గుండెల నిండా నిబద్ధత ఉంది. సీఎం చంద్రబాబు అనుభవం ఆంధ్రప్రదేశ్‌కు అవసరమని చాలా సభల్లో చెప్పా. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించగలిగేది ఒక్క చంద్రబాబే. లక్షలమందికి ఒకటో తేదీనే పింఛన్లు ఇవ్వగలిగారు. నాకంటే బాగా ఆలోచించ గలిగేవాళ్ల వెంట నడిచేందుకు నేనేమీ సంకోచించను. పాలనానుభవం ఉన్న చంద్రబాబు వద్ద నేర్చుకోవాలనే తపన నాకుంది.

**పదవి నాకు అలంకారం కాదు.. బాధ్యత :** ప్రజల కోసం కూలీ మాదిరిగా పనిచేసేందుకు నేను సిద్ధం. వారికి కష్టమొస్తే అండగా ఉంటా. పదవి నాకు అలంకారం కాదు.. బాధ్యతగా ఉంటా. ప్రతి పంచాయతీకి సొంత భూమి ఉండాలి. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే సహించేది లేదు. అవసరమైతే గూండా యాక్ట్ తెస్తాం. ప్రభుత్వ పరంగా పంచాయతీకి ఆస్తులు లేకపోతే వ్యర్థమే. గ్రామాల్లో క్రీడా మైదానాలు కూడా లేని పరిస్థితి ఉంది. దాతలు ముందుకొస్తే నేను కూడా నిధులు తీసుకొచ్చి క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తా. రాయలసీమ నుంచి వలసలు నివారిస్తాం. ఉపాధి అవకాశాలు పెంచుతాం. వలసలను అరికట్టేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ తీసుకొస్తాం" అని పవన్‌కల్యాణ్ అన్నారు. మైసూరువారిపల్లె పంచాయతీకి 10 సెంట్ల స్థలం అందించిన రైతు కారుమంచి నారాయణను ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు.

## ప్రజల అవసరాలు తెలుసుకునే గొప్ప కార్యక్రమం..

● చల్లపల్లి గ్రామసభలో జిల్లా కలెక్టర్ డీ.కే.బాలాజీ



**చల్లపల్లి/అవనిగడ్డ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** గ్రామ అభివృద్ధి అవసరాలు గ్రామస్తుల ద్వారా తెలుసుకొని గ్రామ సభ ఆమోదం పొంది సమస్యలకు పరిష్కారం చూపటం గొప్ప కార్యక్రమం అని జిల్లా కలెక్టర్ డీ.కే.బాలాజీ అన్నారు. శుక్రవారం చల్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మన పంచాయతీ – మన సాధికారత గ్రామసభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ డీ.కే.బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఎల్పిజి సిలిండర్, విద్యుత్తు కనెక్షన్, త్రాగునీటి కుళాయి కనెక్షన్, ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, త్రాగునీటి సరఫరా, డ్రైనేజీల నిర్మాణం, పూర్తిస్థాయిలో వీధిలైట్ల ఏర్పాటు, పూర్తి సంఖ్యలో సీసీ రోడ్ల నిర్మాణము, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణము, లింకు రోడ్ల నిర్మాణము ప్రధాన లక్ష్యాలుగా ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయంగా స్కిల్ డెవలప్మెంట్, శిక్షణ రైతులకు ఉద్యానవన తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. చల్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం మరొక అడుగు ముందుకు వేసి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధాన్ని నిర్దాక్షిణ్యంగా అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గ్రామపంచాయతీ తీర్మానం చేసి వ్యాపారులకు 15 రోజులు గడువిచ్చి, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని నెల రోజుల్లో గ్రామంలో మార్పు తేవాలని కలెక్టర్ ఆదేశించారు. పదకొండు ఏళ్లుగా స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం నిర్వస్తున్న ఈ గ్రామంలో ప్రజలు కూడా ఈ సింగిల్ న్యూస్ ప్లాస్టిక్ నిషేధం అమలు నిర్ణయాన్ని ప్రకటించి మద్దతు ఇవ్వాలన్నారు. కచ్చితంగా ఇంటి స్థాయిలోనే తడి చెత్త, పొడి చెత్త విభజన జరగాలని కలెక్టర్ సూచించారు. సామాజిక స్పృహ ఉన్న గ్రామంగా చల్లపల్లి కనిపిస్తోందని ఇలాంటి గ్రామాల్లోనే విజయాలు సాధించటం సాధ్యమన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని దేశంలో మొట్టమొదటిసారిగా టంగుటూరి ప్రకాశం పంతులు అమలు చేశారని, ఆయన స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ఒకేరోజు విస్తృతస్థాయిలో గ్రామసభలు ఏర్పాటు చేశారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చల్లపల్లి మండలానికి మూడు కోట్లకు పైగా నిధులు చల్లపల్లి గ్రామానికి రూ.2.60 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో బైపాస్ డ్రైనేజీ నిర్మాణం, గ్రామంలో నూటికి నూరు శాతం సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. డ్రైనేజీలు కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో జరుగుతున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకం అన్నారు. సర్పంచ్ కృష్ణకుమారికి కేంద్ర ప్రభుత్వ సత్కారము, గుర్తింపు గర్వకారణం అన్నారు. ఉపాధి నిధులు సద్వినియోగం చేసుకొని ప్రజా ప్రయోజనాలు నెరవేర్చాలని ఎమ్మెల్యే సూచించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్న నేపథ్యంలో నియోజవర్గానికి ఉపాధి పథకం ద్వారా మరిన్ని నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, డ్వామా పీడీ సూర్యనారాయణ, డీవైఈఓ జ్యోతిర్మయి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, తహసీల్దార్ డీ.వనజాక్షి, ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, సీఐ కే.ఈశ్వరరావు, ఏపీఎం రామ్మోహన్, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి ప్రణాళికలు

● వాటికనుగుణంగానే గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు ● గ్రామాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా గ్రామ సభల నిర్వహణ ● జిల్లా కలెక్టర్ డా. జి.సృజన మరియు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్





**ఇబ్రహీంపట్నం,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామసభలు నిర్వహిస్తోందని.. విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన జరుగుతుందని కలెక్టర్ డా. జి.సృజన అన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీలు లక్ష్యంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు జరగ్గా.. ఎన్‌టీఆర్ జిల్లాలోనూ విజయవంతంగా జరిగాయి. ఇబ్రహీంపట్నం మండలం, జూపూడి గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభలకు స్థానిక శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ తో కలిసి కలెక్టర్ సృజన హాజరయ్యారు. గ్రామ సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు

- 8లో

# ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

● ఎమ్.శ్రీనివాస్ వినిల్,జిల్లా సైన్స్ అధికారి



**కాకినాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి ఎమ్.శ్రీనివాస్ వినిల్ అన్నారు.జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని విజ్ఞాన భారతి,పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జగన్నాధపురం బి.ఆర్.మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాల నందు విద్యార్థులకు వివిధ పోటీలను అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథి గా విచ్చేసిన జిల్లా సైన్స్ అధికారి ఎమ్.శ్రీనివాస్ వినిల్ మాట్లడుతు భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2023 జూలై 14వ తేదీన శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి చంద్రయాన్-3 ను ప్రయోగించారని అన్నారు. చంద్రయాన్-3 లో ల్యాండర్ విక్రమ్ చంద్రుడి దక్షిణ ధృవానికి సమీపంలో 2023 ఆగష్టు 23న సురక్షితంగా మృదువుగా దిగిందని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన ఆగష్టు 23న ప్రతి సంవత్సరం జాతీయ అంతరిక్ష దినోత్సవం గా జరుపుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం సాధించిన అద్భుతమైన పురోగతికి నిదర్శనం ఈ ప్రయోగమని తెలిపారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్ల డుతు ఆకాశ వీధుల్లో ఇస్రో జైత్రయాత్ర కొనసాగుతుందని తెలిపారు. అనేక విజయాలు దేశానికి స్ఫూర్తి నింపిన ఇస్రో శాస్త్రవేత్తలు,ఇంజనీర్లు కృషి అంకితభావన్ని మనం గుర్తించాలన్నారు.చంద్రయాన్-3 విజయంపై చక్కటి గీతాన్ని ఆలాపించారు.పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఎన్.బి. సరోజని దేవి మాట్లాడుతు చంద్రయాన్-3 విజయన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్ధి శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాస రావు మాట్లాడుతూ చంద్రుడిని స్పృశించినపుడు - జీవితాలను స్ప్రుశించవచ్చును అనునది 2024 వ సంవత్సరపు జాతీయ అంతరిక్ష దినోత్సవం యొక్క ఇతివృతం గా నిర్ణయించబడిందని తెలిపారు.విద్యార్థులకు అవగాహన కల్పించడానికి విజ్ఞాన భారతి పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదన్నారు.పాఠశాల ఉపాధ్యాయిని వి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రాకెట్ ల నమూనాలు తయారు చేసారు. నమూనాల తయారీ , క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.జయశ్రీ, డాక్టర్ వి.కనక మహాలక్ష్మి ,వి.ఉత్తర శిరీష,ఎ. సుభద్రా దేవి,ఎ.శ్రీదేవి,ఎస్.సూర్య కుమారి,ఎ.నాగమణి పాల్గొన్నారు.315 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 27, 28 తేదీల్లో కేబీఎన్‌లో కాస్మో క్రూయిజ్

● కేబీఎన్‌లో భారత అంతరిక్ష ప్రయాణంపై ప్రదర్శన



**విజయవాడ పశ్చిమ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధించిన విజయాలను వివరించేందుకు ఈ నెల 27, 28 తేదీల్లో కాస్మోక్రూయిజ్ పేరుతో ప్రదర్శనను నిర్వహించనున్నట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా ముద్రించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పోస్టర్‌ను ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్షులు తొమ్మంద్రు శేషయ్య ఆవిష్కరించారు. అనంతరం తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పంపిన తొలి ఉపగ్రహం ఆర్యభట్ట నుంచి ఇటీవల పంపిన చంద్రాయన్%-%3 వరకూ సాధించిన విజయాలు, ఇస్రో ప్రయాణం, వాటివలన మానవాళికి కలిగిన ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన ప్రదర్శనను ఈ నెల 27, 28 తేదీల్లో కేబీఎన్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇస్రో నుంచి వచ్చే నిపుణులు, వివిధ మోడల్స్‌తో కూడిన ప్రత్యేక వాహనం తమ కళాశాలకు చేరుకుంటుందన్నారు. వాటిలో ఆయా ఉపగ్రహాలకు సంబంధించిన నమూనాలతో పాటుగా వీడియోలు విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు జిల్లా వ్యాపితంగా ఉన్న అన్ని విద్యాసంస్థల నుంచి విద్యార్థులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. దీనివలన విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపైన మక్కువ పెరగటంతో పాటుగా వాటిపై అవగాహనను పెంపొందించుకోవటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. వీటిని తిలకించటం ద్వారా పాఠశాలల విద్యార్థులు రానున్న కాలంలో శాస్త్రవేత్తలుగా ఎదగటానికి అవకాశముంటుందని వివరించారు. తొలి రోజు ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కే రామ్మోహనరావు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ కోశాధికారి ఎం హరగోపాల్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, డాక్టర్ కె రామకృష్ణ, పీఎల్ రమేష్, ఫిజిక్స్ విభాగాధిపతి ఆర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బల్లిపర్రు లో 29 లక్షలతో రోడ్ల నిర్మాణం - ఎమ్మెల్యే కాగిత



**పెడన,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** బల్లిపర్రు పంచాయతీ పరిధిలో 29 లక్షల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ చెప్పారు. గ్రామంలో జరిగిన గ్రామసభలో శుక్రవారం నాడు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులు వల్ల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. త్వరలోనే ఉపాధి హామీ పథకం కూలీ రేట్లు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జోగి వరలక్ష్మి అధ్యక్షత వహించగా బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మండల టిడిపి అధ్యక్షుడు సెలపాటి వీర ప్రసాద్ జయలక్ష్మి పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు చందన నారాయణరావు కూటమి నాయకులు అర్ధంపూడి సత్యనారాయణ సమ్మెట సత్యనారాయణ ఉప సర్పంచ్ వాసన నాగజ్యోతి వీరబాబు అధికారులు నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మండలంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్రామ సభలు



**వీరులపాడు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** 2024-25 ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రణాళిక గురించి మండలంలో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా స్పెషల్ ఆఫీసర్లు పాల్గొనడం జరిగింది జయంతి గ్రామంలో ఎమ్మార్వో రాజ్ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులు కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోగలరని అలాగే ఇంకుడు గుంటలు పొలంలో గుంటలు పశువుల షెడ్లు సద్వినియోగం చేసుకోగలరని మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమం పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ మాట్లాడుతూ కూలీలకు ఉపాధి హామీ మంచి సదవకాశం అని మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కట్ట రపు శ్రీనివాసరావు ఉపాధి హామీ పథకంలో వర్కులు చదివి వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గువ్వల సత్యనారాయణ చీదిరాల భరత్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి సచివాలయం సిబ్బంది వీఆర్వోలు గ్రామ ప్రజలు కూలీలు పాల్గొనడం జరిగింది

# కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా పూర్తి చేస్తాం

● శాసనసభ్యులు అరిక పూడి గాంధీ



**శేరిలింగంపల్లి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ డబుల్ బెడ్ రూమ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది.దీనిపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించడం జరిగినది.ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు మాట్లాడుతూ తమరి ఆధ్వర్యంలో మాకు సాయి నగర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించినదుకు చాలా సంతోషంగా ఉంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ కి ప్రత్యేక కృత్తతలు తెలియచేస్తున్నాం అని డబుల్ బెడ్ రూమ్ వాసులు తెలియచేసారు.అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంనకు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని,విధి దీపాలు ఏర్పాటు చేయాలని,సీసీ రోడ్డు ను వేయాలని,అవసరమున్న చోట డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చలని,మంచి నీటి వ్యవస్థ ను మెరుగుపర్చలని,మంచి నీటి బోరు ఒకటి వేయించాలని ఎమ్మెల్యే గాంధీ ని వినతి పత్రం ద్వారా కోరడం జరిగినది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో పర్యటిస్తానని,చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని,కాలనీ లో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని. అన్ని రకాల మౌలిక వసతులు కలిపిస్తామని,అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని,ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని,డ్రైనేజి వ్యవస్థను,మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని అధికారులకు తెలియచేసారు.మంచి నీటి సరఫరా లో అంతరాయం లేకుండా మెరుగైన మంచినీటి సరఫరా చేయాలని,అవసరమున్న చోట మంచి నీటి సరఫరా సమయం పెంచాలని,తక్కువ ప్రెజర్ తో వచ్చే చోట తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ జలమండలి అధికారులకు తెలియచేసారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు తెలియచేసారు.అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని,ఎల్లవేళలో మీకు అందుబాటులో ఉంటానని,మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్,సాయి నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదేశ్ కుమార్,వైస్ ప్రెసిడెంట్ రమేష్,జనరల్ సెక్రటరీ చంద్రయ్య,జాయింట్ సెక్రటరీ సక్రూ,ట్రెజరర్ నర్సింహ రెడ్డి, అడ్వైజర్లు శ్యామ్,నర్సింలు, ఎక్జిక్యూటివ్ మెంబర్లు కూర్మయ్య,సూర్య,మెంబర్స్ శ్రవణ్ కుమార్,శ్రీను,శంకర్, సాయి కుమార్,నవీన్,రాజు, యేసు,మోజేశ్,జైపాల్, సునీల్, రాములు, క్రాంతి, అభిలాష్, ఆనంద్,సాయి మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కోసమే ఉపాధి హామీ పథకం పనులు - బూరగడ్డ వేదవ్యాస్



**పెడన ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** గ్రామాలకు అభివృద్ధి చేసేందుకే కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఉపాధి హామీ పథకం పనులను అమలు చేస్తున్నాము అని శాసనసభ మాజీ ఉప సభాపతి రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు.నియోజకవర్గంలోని గూడూరు మండలం తరకటూరు గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి పథకం పనులు పర్యవేక్షణ గ్రామ పంచాయతీల నందు నిర్వహించే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. తరకటూరు గ్రామంలో నూతన రోడ్లు డ్రైన్లు పనులు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల అధ్యక్షుడు పోతనస్వామి సర్పంచ్ అధికారులు నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# ఆర్.కె.టీమ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు గొడుగులకు పంపిణీ



**శేరిలింగంపల్లి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** ఆర్ కే టీం అధ్యక్షులు గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు,మరియు ఫుట్ పాత్ ల పై నివసిస్తున్న అభాగ్యులకు,సంతలో కూరగాయలు అమ్ముకునే వ్యాపారస్తులకు అతిగా కురుస్తున్న వర్షాలకు తలదాచుకోవడానికి గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ చేతుల మీదుగా గోపనపల్లిలో ఆవిష్కరింపజేశారు.ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అతిగా కురుస్తున్న వర్షాలకు తలదాచుకోవడానికి గొడుగుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్న ఆర్ కే వై టీం సభ్యులను అభినందిస్తూ, ఎక్కడ ఆపద సంభవించిన ముందుండి తమ వంతు సహాయంగా ఆర్ కే వై టీం సభ్యులు సహాయ సహకారాలు అందించడం ఎంతో అభినందించవలసిన విషయం అని తెలుపుతూ వేసవికాలంలో చలివేంద్రాలు, వర్షాకాలంలో గొడుగులు, చలికాలంలో దుప్పట్లు అనేక సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టి రవి కుమార్ యాదవ్ తరపున పేదవారికి మీకు మేమున్నాము అనే భరోసా కల్పిస్తున్నందుకు టీం సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీలకు అతీతంగా,రాజకీయాల కోణంలో కాకుండా సేవ చేయడంలో మా సందయ్య మెమోరియల్ ట్రస్ట్,ఆర్ కే వై టీం సభ్యులు ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీం సభ్యులు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ జాజి రావు శ్రీనివాస్,జె.రాము,నరేష్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, శంకరయ్య మొదలగు వారు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంధ్ర కేసరి జయంతి



**కృత్తివెన్ను,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** స్వాతంత్ర్య సమర యోధుడు, రాజనీతిజ్ఞుడు , ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు ఆయన చిత్ర పటానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హెచ్ ఎమ్ ఏసు పాదం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్య మంత్రి గా పనిచేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమం లో విజయ్ కుమార్, యేసు బాబు, జె రాజ్య లక్ష్మి, మురళీ కృష్ణ, జి రాజ్య లక్ష్మి మొదలగు వారు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ విజేతలను అభినందించిన శ్రీ గౌతమ్ అధినేత ఎన్ సూర్యారావు



**విజయవాడ పశ్చిమ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** ఇటీవల పల్నాడు జిల్లా నర్సరావు పేటలోని ఎమ్ ఏ ఎమ్ కాలేజీ ఏ పి స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించిన చదరంగం పోటీలలో విజేతలైన శ్రీ గౌతమ్ విద్యార్థులకు స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగిన అభినందన సభలో వారి ప్రతిభను స్కూల్ అధినేత ఎన్ సూర్యారావు కొనియాడారు. చదరంగం లో సి హెచ్ చరణ్ చందు( 6 వ తరగతి ) పి దుర్గ ప్రసాద్ (9వ తరగతి) విద్యార్థులు 7 రౌండ్స్ కి 5 పాయింట్స్ గెలిచి ప్రథమ స్థానంలో నిలవగా, వి హేమంత్ 7వ తరగతి విద్యార్థి ద్వితీయ స్థానంలో, అలాగే ఎస్ యశ్వంత్ 8వ తరగతి విద్యార్థి 5వ స్థానంలో నిలిచారు. విజేతలు అందరికీ స్కూల్ డైరెక్టరు ఎన్ సూర్యారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ గౌతమ్ లో విద్యార్థులు అన్ని రంగాలలో కరాటే, నృత్యం, చదరంగంలో మరియు వివిధ పోటీ పరీక్షలలో బహుమతులు కైవసం చేసుకోవటం శ్రీ గౌతమ్ ప్రతిభకు, నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి తులసి, వైస్ ప్రిన్సిపాల్ పి శ్రీరామ్ హైస్కూల్ ఇన్ చార్జి బి మోహన్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు కోసమే ఫ్రైడే - డ్రై డే కార్యక్రమాలు

● విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** వర్షాకాలంలో వర్షపు నీటి నిలువల వల్ల పెరుగుతున్న దోమల లార్వాలను అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమమే ఫ్రైడే -డ్రై డే అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న 64 డివిజన్లోనూ ప్రజలకు దోమల వల్ల కలుగు మలేరియా, చికెన్ గునియా, డెంగ్యూ జ్వరాల బారిన పడకుండా శుక్రవారం ఉదయం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగర పరిధిలో ఉన్న 64 డివిజన్లలో హెల్త్ సెక్రటరీలు ప్రతి ఇంటికి వెళ్లి నిల్వ ఉన్న నీళ్ల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పడమే కాకుండా వాటిని పాడవేసి వాటి వల్ల కలుగు వ్యాధుల గురించి చెప్పి ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. నెహ్రూ నగర్, కొత్తపేట, వించిపేట తదితర ప్రాంతాలలో ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ మైకు ద్వారా అనౌన్స్మెంట్లు ఇచ్చుకుంటూ ప్రతి శుక్రవారం ప్రతి ఇంటిలో ఉన్న నీటి నిల్వలు ఉండే అవకాశం ఉన్న కొబ్బరి బొండాలు, రుబ్బురోలు, కూలర్లు, పూల కుండీలు, తొట్టులు ఇలాంటివి ప్రతి శుక్రవారం శుభ్రపరచుకోవాలని, అలా చేయడం వలన దోమలు లార్వా పెట్టే అవకాశం ఉండదని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని అవగాహన కల్పించారు. ఇలా ఫ్రైడే- డ్రై డే నిర్వహించడమే కాకుండా ప్రతి డివిజన్లో యాంటీ లార్వే ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని కలవట్లలో, వీధుల్లో ఫాగింగ్లు చేసుకుంటూ కాలువలో, మేజర్ అవుట్ఫాల్ డ్రైన్ లలో డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేస్తున్నామని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు.

# ముగిసిన డ్రై డే ఫ్రైడే

**విస్సన్నపేట,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల నిర్మూ లన అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో తెలిపారు.





ఉపాధి హామీ గ్రామ సభలో చట్టనవరం గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ మరియు గ్రామపంచాయతీ సర్పంచ్ చలమాల దుర్గారావు గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు గురజాల హరికృష్ణ, పాల్గొన్న గ్రామ ప్రజలు

-వీరులపాడు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :

# క్షతగాత్రులకు సేవలు చేసి 108 లో తరలించిన వైద్య సిబ్బంది



**చేజర్ల,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** మండలంలోని చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు పనిచేస్తున్న డాక్టర్ ఈ.నవీన్ వారి వైద్య సిబ్బందితో నాగులవెల్ల టూరులో 104 కార్యక్రమమునకు శుక్రవారం బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యమున గోపారం వద్ద కారు యాక్సిడెంట్ జరిగి ఉండటాన్ని గమనించి వెంటనే డాక్టర్ మరియు వారి వైద్య సిబ్బంది గాయాలతో వున్న క్షతగాత్రులకు సేవలు అందించి 108 వాహనంలో క్షతగాత్రులను హాస్పిటల్ కు తరలించడం జరిగినది.

# ఆకివీడు ఎస్ ఐ గా బాధ్యతలు చేపట్టిన హనుమంతు నాగరాజు



**హనుమాన్ జంక్షన్, ఆగష్టు 23 (వార్తాప్రభ) :** ఆకివీడు ఎస్ ఐ గా హనుమంతు నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్ కు చెందిన నాగరాజు కాకినాడ, భీమవరం , తణుకు తదితర పోలీస్ స్టేషన్ లలో పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే ప్రతిష్టాత్మకమైన గన్నవరం ఇంటిల్జెన్సీ లో పనిచేసి తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఎస్ ఐ నాగబాబు నుండి బాధ్యతలు స్వీకరించిన హనుమంతు నాగరాజును సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

# పూర్ణకుంభంతో తిరువూరు ఎమ్మెల్యేకు బ్రహ్మారథం



**విస్సన్నపేట,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని నరసాపురం గ్రామంలో శ్రీ సూర్య లక్ష్మీనారాయణ దేవాలయమునకు ఎమ్మెల్యే హోదాలో తొలిసారి వచ్చిన కొలికిపూడి శ్రీనివాసరావుకు పూర్ణకుంభంతో వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షుడు టిడిపి సీనియర్ నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు స్వాగతం పలికారు. స్వస్తిశ్రీ శ్రీ క్రోధి నామ సంవత్సర దక్షిణాయనం వర్ష ఋతువు శ్రావణమాసం శుక్రవారం తొలి అడుగు పెట్టిన తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాస రావు, ఎన్ఆర్ఐ గిరి, మండల టిడిపి అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు, ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు (దాబా శ్రీను) తదితరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుగంధాది పరిమళ సువాసనలు వెళ్లే పూలదండలతో పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమమునకు వందలాది మంది హాజరయ్యారు

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న సొంటిరెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్ లో గల శ్రీ ఎస్పిఆర్ గ్లోబల్ స్కూల్ నందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకలలో శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... శ్రీకృష్ణ భగవానుడు భూమిపై అవతరించిన రోజుగా భక్తులు శ్రీకృష్ణ జన్మాష్టమి ని ఉత్సాహంగా జరుపుకుంటారని అన్నారు. శ్రీకృష్ణుడు దేవకి, వాసుదేవల కుమారుడిగా మధురలో జన్మించాడని, ఈ కృష్ణాష్టమి రోజున కృష్ణుడి ఆశీస్సులతో మన జీవితాలు సత్యం ధర్మం శాంతి, ఆనందంతో నిండాలని కోరుకున్నానని, విద్యార్థిని విద్యార్థులు అందరూ శ్రీకృష్ణ పరమాత్మ యొక్క యుగము నాటి శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో వచ్చి వాళ్లను కళ్ళకు కట్టేలా చూపించారని పాఠశాల చేపట్టినటువంటి ఈ కార్యక్రమంలో పిల్లలు చాలా సందడి చేశారని తెలిపారు.

## ఘనంగా ఆంధ్ర కేసరి టంగుటూరి జయంతి వేడుకలు..



**నూజివీడు /ఏలూరు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరిం చుకొని శుక్రవారం ఉదయం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నూజివీడు రెవిన్యూ డివిజనల్ అధికారి వై. భవానీశంకరి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆర్డీవో వై. భవానీశంకరి మాట్లాడుతూ మహాత్ముల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడవాలని ఆర్డీఓ కోరారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి దుర్గాప్రసాద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం పున నిర్మాణం నిమిత్తం విరాళం ఇచ్చిన బండి బ్రదర్స్



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా బాపులపాడు మండలం సింగన్నగూడెం గ్రామంలో వేయుచున్న శ్రీ గంగా పార్వతి సమేత సామేశ్వర స్వామి ఆలయం పున నిర్మాణం నిమిత్తం గన్నవరం మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన బండి భాస్కర్ మరియు తమ్ముడు చక్రి వారి ఇరువురు వచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి 1.05.000/- రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు వారి కుటుంబ సభ్యులకు స్వామి వారి ఆశీస్సులు వారిపై ఎప్పుడు ఎల్లప్పుడూ అలాగే ఉండాలని ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగేశ్వరరావు, శర్మగారు, గ్రామ ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, ఆలయ చైర్మన్ నక్క శ్రీమన్నారాయణ, కొట్టే రాజా, తిరుపతిరావు మరిదు, శ్రీను, గాలి రాకడ రాజు, చిన్నాల కృష్ణ, ఈతాకుల ప్రసాద్, పల్లగానీ నాగేశ్వరరావు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం గ్రామ సభలో పాల్గొన్న స్థానిక ఉమ్మడి నేతలు



**కృత్తివెన్ను,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం, కృత్తివెన్ను మండలం లోని లక్ష్మీపురం గ్రామంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మంగా ఎన్ ఆర్ ఈ జీ ఎస్ పనులు మరియు పర్యవేక్షణ నిమిత్తం లక్ష్మీపురం గ్రామపంచాయతీ నందు నిర్వహించబడిన గ్రామ సభలో లక్ష్మీపురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పులగం నాగభూషణం(చిన్నబ్బులు), లక్ష్మీపురం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు పులగం శ్రీను మరియు తెలుగుదేశం జనసేన బిజెపి కార్యకర్తలు పాల్గొని లక్ష్మీపురం గ్రామంలో చేపట్టవలసిన నూతన రోడ్లు డ్రైన్ల పనులు, మరియు ఇతర పనుల నిర్మాణానికి అవసరమైన వాటి గురించి స్థానిక సర్పంచ్ పులగం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు లక్ష్మీపురం గ్రామ నాయకులు కార్యకర్తలు, అభిమానులు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కైకలూరు పంచాయతీ గ్రామ సభలో పాల్గొన్న కూటమి నాయకులు



**కైకలూరు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కైకలూరు,ఆగష్టు 23:స్థానిక గ్రామపం చాయతీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్,కైకలూరు శాసనసభ్యు లు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయితీలలో నిర్వహించే " గ్రామసభలు" కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి,జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీ రాణి,రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజీ),జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కె.కె.బాబు,తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,పట్టణ టిడిపి అధ్యక్షులు యమ్.డి.జానీ,మండల టిడిపి ఉపాధ్యక్షులు యమ్.డి.ఉస్మాన్,జనసేన నాయకులు కొల్లి వంప్రసాద్ (బాబి),భారతీయ జనతా పార్టీ నాయకులు కీర్తి రామ్ ప్రసాద్,మాజీ యమ్.పి.టి.సి పైడిమర్రి రాధాకృష్ణ, వేములపల్లి కారుణ్య,బోయిన రామకృష్ణ, రసూల్ ఖాన్,హబీబ్,తులసి పూర్ణ, గృహనిర్మాణ శాఖ ఏడీ - స్పెషల్ ఆఫీసర్ వి.వి శేఖర్,దానం ప్రసాద్,ఆశావర్కర్లు, సచివాలయ,పంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యం కోసమే గ్రామ సభలు - డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి





**కనిగిరి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం కనిగిరి నియోజకవర్గం లోని సిఎస్ పురం గ్రామంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సారథ్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ప్రకాశం జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియ, సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డోల బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. గ్రామ సభలో ప్రజలు అనేక సమస్యలు వివరించారు. సీఎస్ పురంలో చెరువు కట్టమీద డబల్ రోడ్డు ఏర్పాటు చేయడం వలన పొలాల్లోకి వెళ్ళటానికి దారి లేకుండా పోయిందని, పంట కాలవ పూర్తిగా అన్యాక్రాంతానికి గురి అయిందని, మారుమూల గ్రామాల మహిళలు సులభ కాంప్లెక్స్ లేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఆరు లైన్ల రోడ్డు నిర్మాణము జరుగుతుండగా రైతులకు కాంపన్ శేషన్ అందలేదని, సిఎస్ పురం ప్రాంత ప్రజలు ఎక్కువగా వలసలు వెళ్తారని ఆ వెళ్లిన వారి పొలాలను ఇతరులు ఆన్లైన్ చేయించుకున్నారని సమస్యలను కలెక్టర్ దృష్టికి, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ సిఎస్ పురం ప్రాంతంలో 6 వేలకు పైగా వలసలు వెళ్లారని, జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎంతోమంది జీవనం సాగిస్తున్నారని, సిఎస్ పురం గ్రామానికే నాలుగు కోట్ల రూపాయల నిధులుమంజూరు చేయడం జరిగిందని ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని రైతులకు కాంపెన్సేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. శాసనసభ్యులు ఉగ్ర నరసింహ రెడ్డి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం అయినా సిఎస్ పురంలో గ్రామసభ అనగానే వెనుకబడ్డ ప్రాంతానికి వెళ్లడానికి తక్షణమే అంగీకరించడం జరిగిందని మంత్రి బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో 600 కోట్లతో మంచినీటి సౌకర్యం కల్పిస్తే గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కాలనీలో మౌలిక సదుపాయాలు, సిమెంట్ రోడ్లు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జరిగినవి అని, గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని మంత్రి బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఉషారాణి, ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఎంపీడీవో రామచంద్రరావు, మాజీ ఎంపీపీ తూదేటి అల్లూరయ్య, మాజీ స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు, జిల్లా చీఫ్ సొసైటీ చైర్మన్ తోదేటి గోపి, సిఎస్ పురం సర్పంచ్ శ్రీరామ్ పద్మావతమ్మ, సిఎస్పురం సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బోయిళ్ళ నారాయణరెడ్డి, పాలకొల్లు వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా గ్రామ సభల నిర్వహణ

**● ఆర్ డీ వో బిహెచ్.భవానీ శంకర్**



**జి.కొండూరు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** గ్రామాల సర్వతోముఖాభి వృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ సభలు నిర్వహిస్తు న్నట్లు విజయవాడ ఆర్ డీ వో బిసిహెచ్ భవానీ శంకర్ అన్నారు.మండల ప్రత్యేక అధికారి జి.మోహన్ బాబు ఆధ్వర్యంలో మండలంలోని 22గ్రామ పంచాయితీ కార్యాలయాలలో శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాలలో కూలీల కు పనులు కల్పించడానికి ఉపాధి హామీ పథకంలో చేపట్టవలసిన పనులు గుర్తించేందుకు గాను గ్రామసభలు నిర్వహించారు.జి.కొండూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరుగుతున్న గ్రామసభ కు సబ్ కలెక్టర్ భవానీ శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో చేపట్టే పనులు, సామాజిక తనిఖీ ప్రాధాన్యత తదితర విషయాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి, తద్వారా నాణ్యమైన పనుల ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు.అంతకు ముందు ఎంపిడివో పి.అనురాధ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు గుర్తించిన పనుల ఆమోదం,ఇంతవరకు చేపట్టిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులను కూడా గ్రామ ప్రజలకు వివరించారు.ఉపాధి హామీ పథకం వేతనదారుల హక్కులను తెలియజేశారు. జాబ్ కార్డు పొందే హక్కుతో పాటు పనికోరిన 15 రోజుల్లో పని పొందే హక్కు, ప్రణాళిక రూపొందించి, పనుల జాబితా తయారు చేసే హక్కు, చేసిన పని కొలతల ఆధారంగా వేతనాల చెల్లింపు తదితరా లను క్షుణ్ణంగా వివరించారు.గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక అనేది ప్రజలందరి భాగస్వామ్యంతో జరగాలి అనే ఉద్దేశంతో ఈ సభలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండల అరుణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్, మండల ఈవోపీఆర్ అండ్ ఆర్ డి భారతి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఏటుకూరి బసవలింగేశ్వరరా వు,ఉపాధి హామీ పథకం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మాణ రంగానికి కొత్త ఊపిరి వచ్చినట్టే

**● ఐదేళ్ళ పీడ కలలకు ఇక స్వస్తే... ● బాయ్ అసోసియేషన్ సభ్యుల్లో వెల్లివిరిసిన నూతనోత్సాహం ● పెండింగ్ పేమెంట్స్ వసూలు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు**



**విజయవాడ పశ్చిమ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** లబ్బిపేట లోని, స్థానిక హోటల్ లో బాయ్ (బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ఇండియా ) రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. దీనికి రాష్ట్రం లో ని వివిధ చాప్టర్స్ నుండి, సుమారు 100 మంది ప్రతి నిధులు హాజరు అయ్యారు. రాష్ట్రం లో నిర్మాణ రంగం ఎదు రుకుంటున్న వివిధ సమస్యలు,ఇసుక , నైపుణ్యం గల నిర్మాణ కార్మికులు, ముఖ్యం గా, కాంట్రాక్టర్స్ గత 5 సంవత్సరాలుగా అంత కు ముందు జరిగిన రోడ్స్, భవనాలు మొదలగు వాటికీ రావలిసిన పేమెంట్స్ గురించి ప్రతినిధులు తీవ్ర బాధను ఆవేదను వ్యక్త పరిచారు. ఐదేళ్ళ పీడ కలలకు ఇక స్వస్తే నని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతినిధుల భావాలకు అనుగుణంగా గా ఒక కమిటీని నియమించి ప్రభుత్వ వర్గాలలో సంప్రదింపుల ద్వారా సమస్యలను ముఖ్యం గా, పేమెంట్స్ సాధించేదుకు ప్రయత్నిచాలని నిర్ధరిమిలా నిర్మాణ రంగం లో ని కార్మికులకు నైపుణ్య శిక్షణ, సాంకేతిక విషయాలపై అవగాహనా మొదలగు కార్యక్రమాలు నిర్వహించుటకు "స్కూల్ ఆఫ్ ప్లానింగ్ మరియు ఆర్కి టెక్చర్ "వారి తో, బిల్డర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ శాఖ (ఎమ్ ఓ యు) చేసుకోవడం జరిగిందని బాయ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి, బాయ్ రాష్ట్ర శాఖ, చైర్మన్, అత్తలూరి నాగమల్లేశ్వరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగాఎస్ పి ఏ డైరెక్టర్ సిరికొండ రమేష్ , అతిధులు గా, చెరువు రామకోటయ్య , పూర్వ జాతీయ ఉపాధ్యక్షులు, వల్లభనేని వెంకటేశ్వరావు, పూర్వ జాతీయ ఉపాధ్యక్షులు, పిరాజబాబు , బి రాఘవ రావు , పూర్వ రాష్ట్ర అధ్యక్షులు కే వి ఎస్ బుచ్చి రాయుడు, రాష్ట్ర కార్య దర్శి, పి శేషగిరి రావు , రాష్ట్ర శాఖ, కోశాధికారి, ఎన్ నాగేశ్వరావు , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ కాశీ విశ్వేశ్వరావు , రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్రం లోని, వివిధ సెంటర్ చైర్మన్స్ మరియు యస్. పి. ఏ విజయవాడ కు చెందిన ప్రొఫెసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక పై లైంగిక వేధింపులు!!!

**● ఉద్యోగ ముసుగులో కీచక పర్వం!!!**



**మచిలీపట్నం,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** మచిలీపట్నం శుక్రవారం మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. కొన్ని సంవత్సరాల నుండి వేధింపులకు పాల్పడుతున్నాడని మైనర్ బాలిక వాపోయింది. బాలిక ధైర్యం చేసి ముందుకు రావడంతో వెలుగులోకి వచ్చిన కామాంధుడి ఘటన. ఇతగాడి టార్గెట్ మైనర్ ఆడపిల్లలు. స్థానిక రెండో డివిజన్ చెందిన ఒక ప్రైవేటు పాఠశాలలో రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అతగాడు పాఠశాలలో చదువుతున్నప్పటినుంచి వేధింపులకు పాల్పడుతున్నట్టు మైనర్ బాలిక ఆరోపించింది. మైనర్ బాలికకు తండ్రి లేకపోవడం తల్లి దివ్యాంగురాలు కావడంతో కామాంధుడు వేధింపులు ఎక్కువయ్యాయని మీడియా ముందర కన్నీరు పర్యంతమైంది. ఇటీవల కాలంలో తనను ప్రేమించాలి లేక పెళ్లి చేసుకోమంటూ ఇంటి ముందుకు వచ్చి వేధించడంతో కామాంధుడి పైసాచిక కోరికలు మైనర్ బాలికకు తలనొప్పిగా మారింది. అతగాడి పై గతంలో గుడివాడకు చెందిన బాలిక ఇతని వేధింపులు తట్టుకోలేక మచిలీపట్నం హాస్టల్ లోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రైవేటు ఉన్నత పాఠశాలలో చదువుతు న్నప్పటి నుండి ఏదో ఒక నెపంతో తన దగ్గరకు వచ్చి మాట్లాడటం పక్కన ఎవరూ లేరు అని నిర్ధారించుకున్న తర్వాత తనను తాకుతున్నాడని, శారీరక వాంఛ తీర్చాలంటూ లేక వివాహం చేసుకోమని తన తల్లి ముందరే తనను మానసికంగా వేధిస్తున్నాడంటూ మైనర్ బాలిక భావోద్వేగం కు గురైంది. రెండు రోజుల క్రితం తన ఇంటి వద్దకు వచ్చిన కామాంధుడు గొడవ చేసి వెళ్లడంతో తీవ్ర అసహనానికి గురైన మైనర్ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నిర్ణయించుకుంది. తన కూతురు మైనర్ బాలిక పడుతున్న ఆవేదనను అర్థం చేసుకొని గతంలో పెళ్లయి పిల్లలు ఉన్న 50 పదుల వయసు ఉన్న వ్యక్తి మైనర్ బాలిక వెనుకబడి వేధిస్తుండటం తీవ్రంగా పరిగణించింది. వెంటనే మచిలీపట్నం పోలీసులకు కామంధుడిపై ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన మచిలీపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయ కమిటీ సభ్యుల సంకల్పానికి అమ్మవారి అనుగ్రహం తోడైతేనే దేవాలయ నిర్మాణం సాధ్యం : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

**● ఘనంగా గాజులరామారం "శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయ" పునఃప్రతిష్టాపన కార్యక్రమం**



**కుత్బుల్లాపూర్,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** గాజుల రామారం డివిజన్ శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయ పునఃప్రతిష్టాపన కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవారాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, అమ్మవారి కృపా కటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని. ఆలయ నిర్మాణం అంటేనే ఎంతో శ్రమ, త్యాగం తో కూడుకున్న పని అని. ఇంత పెద్ద దేవాలయ నిర్మాణం చేపట్టాలంటే ఆలయ కమిటీ సభ్యుల సంకల్పానికి అమ్మవారి అనుగ్రహం తోడైనప్పుడే ఇంతటి నిర్మాణం సాధ్యం అవుతుందని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని అమ్మవారి ఫోటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, గోవర్ధన్ రెడ్డి, ఇబ్రహీం బేగ్, వాహీద్, బొయిని మహేష్, ప్రసాద్, శ్రీశైలం, జునైద్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం, విజయ్ కుమార్, జ్ఞానేశ్వర్, కిరణ్, రవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పలుకునూరి తులసి రెడ్డిని శాలువాతో సత్కరించిన కొలన్ హనుమంత్ రెడ్డి



**దుండిగల్,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేటకు చెందిన పలుకునూరి తులసి రెడ్డి యూరప్ ఖండంలోని ఎత్తైన మౌంటెన్ పర్వతాన్ని అధిరోహించాడు ఈనెల 11 వ తారీఖున శిఖరం ఎక్కడం ప్రారంభించిన తులసి రెడ్డి ఈనెల 15వ యూరప్ ఖండాల్లోని అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించాడు లక్ష్యాన్ని నాలుగు రోజుల్లోనూ చేరుకున్నట్లు తెలిపాడు దీని ఎత్తు 5642 మీటర్ ఉంటుందని వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ ఆగస్టు 15న అక్కడ జాతీయ పథకాన్ని చేత పట్టుకొని జై భారత్ అని నినాదాలు చేసినట్లు పేర్కొన్నారు. తులసి రెడ్డి గత ఏడాది అక్టోబర్లో పర్వతాన్ని అధిరోహించారు ఈ విషయాన్ని తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆయనను కలిసి షాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బల్ రెడ్డి, నవీన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి లంక లితీష్ ఆర్థిక సాయం



**మైలవరం,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** మైలవరం టౌన్ బాలయోగి నగర్ కు చెందిన పెద్దల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ పెద్దల వెంకటేశ్వ రరావు కుటుంబాన్ని పరామర్శించారు. తన సొంత నిధులు నుంచి రూ.5000 లు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం స్థానిక నాయకు లతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.లితీష్ వెంట దూరు బాలకృష్ణ,బుడిపూడి వెంకట్రావు, పరికల సాంబయ్య ,నందేటి భార్గవ్, సక్కుర్తి బాబురావు, మమ్ము ,రాములు, ప్రత్తిపాటి రాంబాబు,కిట్టు, సత్యం తదితరులు ఉన్నారు.

## యనమల కుదురు లోని.... మజీద్ ఏ ఫైజ్ నిర్వహణకు కేర్ కమిటీ వేసిన వక్ఫ్ అధికారాలు రద్దు చేసిన హైకోర్టు

**విజయవాడ, ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా యనమలకుదురు లోని మస్జిద్ ఏ ఫైజ్ అధ్యక్షులు అష్రాఫ్ శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యనమలకుదురు లోని మజీద్ ఏ ఫైజ్ కమిటీ ఆధ్వర్యంలో కార్యకలాపాలు ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు స్థానికులు సంతృప్తిగా ఉన్నా సరే ఉద్దేశపూర్వకంగా కొంతమంది ప్రోత్బలంతో వక్ఫ్ అధికారులు మజీద్ నిర్వహణ చేపడుతున్న మజీద్ ఏ ఫైజ్ కమిటీ సభ్యులను ఇబ్బందులను గురిజేస్తూ కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండా కేర్ కమిటీని ఏర్పాటు చేయటం పై స్థానిక కమిటీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు.గౌరవ హైకోర్టు కేర్ కమిటీ ని రద్దు చేసినట్లుగా మజీద్ ఏ ఫైజ్ అధ్యక్షుడు అష్రాఫ్ తెలియజేశారు. స్థానికంగా కొంతమంది దురుద్దేశంతో కల్లోలాలు సృష్టించాలని ప్రయత్నిస్తూ ఉంటే వాటిని సర్ది చెప్పకుండా, పవిత్ర మసీదు స్థలాలలో గొడవలకు ఆద్యం పోస్తున్న వక్ఫ్ అధికారుల తీరు మార్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. హైకోర్టు ఉత్తర్వులను గౌరవ హైకోర్టు వెబ్సైట్ నందు కేసు నెంబర్ 17152..నెంబర్లలో సరిచూసుకోగలరని అధికారులను ఆయన కోరారు.

## టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలు



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ హై స్కూల్ రేమల్లె నంద ప్రధానోపాధ్యాయుడు నన్నే పాముల లోదర్పాల్ అధ్యక్షతన ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, స్వాతంత్ర సమరయోధుడిగా ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, ఆంధ్ర కేసరిగా పేరు పొందిన టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శనీయులని హెచ్ఎం సూచించారు. సాంఘిక శాస్త్ర సీనియర్ ఉపాధ్యాయులు దారపు రెడ్డి భాస్కరరావు ప్రకాశం పంతులు జీవితం విద్యార్థులు అందరూ చదివి మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివి పార్ధసారథి, పరసా రాజేష్,వెలమర్తి రవిబాబు, టీవీ శ్రీలక్ష్మి,దేవరపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గంగినేనిపాలెం జెడ్పి పాఠశాలలో ఆంధ్రకేసరి జయంతి



**జి.కొండూరు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** మండలంలోని గంగినేని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి వి రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధు లలో సమయస్ఫూర్తిని రగిలించిన టంగుటూరి ప్రకాశం నేటి యువతకు ఆదర్శం అన్నారు.తెలుగు ఉపాధ్యాయు డు డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహంలో ప్రకాశం పంతులు కీలక పాత్ర పోషించారని అన్నారు. ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలు రాజధానిగా చేసుకొని రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకున్నారనీ,తన జీవితాన్ని ధనాన్ని దేశ సేవకు ప్రజాసేవకు వెచ్చించిన టంగుటూరి ప్రకాశం ప్రజల మనిషిగా ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచారన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరా జాన్ బాషా వెంకటేశ్వరరావు,సాంబశివరావు, రేఖ, సునీత, లతా, రమా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అండర్-14 తొమ్మిదవ జాతీయస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ కు ధనశేఖర్ ఎంపిక



**చంద్రగిరి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** తమిళనాడు రాష్ట్రం షోలింగరం నగరంలో జరిగిన అండర్-14 తొమ్మిదవ జాతీయస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో చంద్రగిరి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీకి చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్.ధన శేఖర్ ఆంధ్రప్రదేశ్ తరఫునుంచి ఫాస్ట్ బౌలర్ గా తన అసాధారణ ప్రతిభను కనబరచడం జరిగింది.తన ప్రతిభను గుర్తించిన సెక్షన్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ రంభ దుర్గా ప్రసాద్ ధన శేఖర్ కు తర్వాత జరగబోయే జాతీయ జట్టుకి అయ్యే ఖర్చులు మొత్తం తమ అసోసియేషన్ స్పాన్సర్షిప్ అందజేస్తుందని తెలియ జేశారు.ఇంతటి అవకాశం దక్కించుకున్న తమ విద్యార్థి ధన శేఖర్ ను స్కూల్ కరస్పాండెంట్ బివి కృష్ణారెడ్డి మరియు ప్రిన్సిపల్ సురేష్ అభినందనలు తెలియజేశారు.

# ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి..

**● ప్రయాణికుల పట్ల ఆటో డ్రైవర్లు మర్యాదగా నడుచుకోవాలి**
**● అన్ని అర్హత పత్రాలు కలిగి ఉండాలి ●15 మంది ఆటో డ్రైవర్లకు సన్మానం ● డిఎస్పి అబ్దుల్ రెహమాన్**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కొత్తగూడెం,ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని డిఎస్పి అబ్దుల్ రెహమాన్ సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్ల అందరికీ శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో డిఎస్పీ మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు అందరూ ట్రాఫిక్ రూల్స్ ను పాటించి, సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆటోడ్రైవర్లందరికీ ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశాలను జారీ చేశారని అన్నారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ,రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి ఆటోలను నడపడం,నిర్లక్ష్యంగా రోడ్లపై ఇష్టానుసారంగా ఆటోలను నిలిపివేసి, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఆటో డ్రైవర్లందరూ క్రమశిక్షణ కలిగి ఉండి తమ వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలను ఎల్లప్పుడూ తమతోనే ఉంచుకోని,పోలీసు వారి జరిమానాలకు గురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. డ్రైవర్ సీటు వెనక భాగంలో డ్రైవర్ పేరు మరియు ఫోన్ నెంబరును ప్రయాణికులకు కనిపించే విధంగా కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మంచి పనులు చేస్తున్న ఆటో డ్రైవర్ల పట్ల ఆదర్శంగా నిలిచిన 15 మంది డ్రైవర్లను గుర్తించి ఈ సందర్భంగా ఆయన సన్మానించారు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో లక్ష్మీదేవి పల్లి ఎస్ఐ రమణారెడ్డి, 3 టౌన్ ఎస్ఐ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధులు పసి పిల్లల వంటి వారు - డాక్టర్ చప్పిడి



**కాకినాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** వృద్ధాప్యం పసితనం వంటిది అని పసిపిల్లల ప్రవర్తిస్తారని వారిని ప్రేమగా సాగాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం సీనియర్ నాయకులు పాయకరావుపేట పరిశీలకులు, అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర అన్నారు జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సూర్య నగర్లో గల జనవరి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల దినోత్సవ వేడుకలు అలయన్స్ క్లబ్ స్వాతి హెల్పింగ్ అండ్ అధ్యక్షులు పెంకె గోవిందరావు అధ్యక్షతన జరిగినవి ఈ కార్యక్రమంలో అలై వనుం శ్రీనివాసరావు డిస్ట్రిక్ట్ గవర్నర్ ముఖ్య అతిథిగా అలై. డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. వృద్ధులకు ధైర్యం చెప్పి మాట్లాడి మనోధైర్యం వచ్చేలా వారితో కలిసి మెలిసి ఉండటం జరిగింది ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులని వయసు వచ్చిన తర్వాత వారి వద్ద ప్రేమగా సా కాలని ఈ సందర్భంగా చప్పిడి తెలియజేశారు తదుపరి పండ్లు ఫలహారాలు వారికి అందించారు.ఈ కార్యక్రమంలో రీజన్ చైర్పర్సన్ దుర్గా సుభద్ర,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రెటరీ కిరణ్ కుమార్, ముదన వెంకటేష్ గణేష్,మేము సైతం అధ్యక్షులు గణేష్ సత్తిబాబు, కొత్త శ్రీరాములు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ దిశగా రాందేవ్ రావు హాస్పటల్



**కూకట్ పల్లి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** గత సంవత్సరం రాందేవ్ రావు హాస్పటల్లో డాక్టర్ ఛాయా దేవి ( అబ్స్ట్రిక్ అండ్ గైనకాలజీ ) చేతుల మీదగా హెచ్ పి వి ఫ్రీ వాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమై ఏడాది గడిచినది. ఈ సంవత్సర కాలంలో సుమారు 1500 మంది 9 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ఉచితంగా ఈ వ్యాక్సినేషన్ అందించడం జరిగింది. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు రాందేవరావ్ హాస్పటల్లో భారీ ఎత్తున ఫ్రీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుముదిని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు మరియు యాజమాన్యం పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం మీరా రావు, రాందేవ్ రావు, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ ఛాయాదేవి, ఆసుపత్రి సీఈవో డాక్టర్ యోబు, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ అపర్ణ, మరియు వైస్ ప్రిన్సిపల్ సెలీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఛాయాదేవి మాట్లాడుతూ సరైన అవగాహన లేకపోవడం వలన ఎంతో మంది మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారని రాబోతున్న కాలంలో మహిళలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి విముక్తులను చేయడమే మన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంతగానో సహకరిస్తున్నటువంటి హాస్పటల్ యాజమాన్యం విక్రం దేవ్ కి మీరా రావు కి అపర్ణ కి ప్రశాంత్ రావుకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ సమాజంలో ఒక గొప్ప మార్పు కోసం ఎంతగానో కృషి చేస్తున్నటువంటి డాక్టర్ ఛాయాదేవికి అభినందనలు తెలిపారు. అలాగే హాస్పిటల్ యాజమాన్యం యొక్క సహకారం ఎల్లప్పుడూ తమకు ఉండే విధంగా డాక్టర్ కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజ్ లోని 50 మంది విద్యార్థినులకు ఫ్రీగా వ్యాక్సినేషన్ అందించడం జరిగింది. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ అపర్ణ మరియు వైస్ ప్రిన్సిపల్ సెలీనా ఈ సందర్భంగా తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి గొప్ప సంస్థకు అనుసంధానంగా ఉన్న కుముదుని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో వర్క్ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే ఈ ఫ్రీ వాక్సినేషన్ ద్వారా ఆడవారికి రాబోతున్న తరాలలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నుంచి కాపాడగలమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించినటువంటి రాందేవ్ రా హాస్పిటల్ యాజమాన్యానికి మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపర్డెంట్ మేరీ డేవిడ్, డ్యూటీ డాక్టర్స్ డాక్టర్ శృతి, డాక్టర్ ప్రిన్సి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అనూష, డాక్టర్ నవ్య, నర్సింగ్ ఇన్చార్జులు మరియు, అడ్మిన్ మేనేజర్లు కల్పన రమ శ్రవణ్ రెడ్డి క్రాంతి కుమార్ భారతి శ్రీనివాసరావు సురేష్ రాజు రుద్ర సుగుణరావు నాగేంద్ర రణదీప్ రవీంద్ర లలిత యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ -వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ను వ్యతిరేకిస్తున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు..



**గుడివాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఐక్యవేదిక తరఫున మేము కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ హాజీ సయ్యద్ మహబూబ్ అలీ తెలిపారు. శుక్రవారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ.. ఇది ముస్లిం మైనారిటీలకు సంబంధించిన విషయం. ఇలా ముస్లిం చట్టాలను, మా యొక్క హక్కులను కాల రాసే ప్రయత్నాలు చేస్తే, మేము ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ముస్లిం సంఘాలు మరియు దేశంలో ఉన్న అన్ని ముస్లిం సంఘాలు చూస్తూ మౌనంగా ఉండమని హెచ్చరించారు. ఈ బిల్లుకు పూర్తిగా వ్యతిరేకత తెలియజేస్తున్నాము. మరియు రాష్ట్ర పార్టీల వారు కూడా ఈ బిల్లును సమర్థించకూడదు అని వారు కూడా వ్యతిరేకించాలని ముస్లింల గౌరవాన్ని మరియు వారి యొక్క మనో భావాలను దెబ్బతీయకుండా కాపాడాలని మేము కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ షుకూర్, సయ్యద్ సిద్ధిక్ భాషా, షేక్ హుస్సేన్ భాషా మొహమ్మద్ ఇక్బాల్ బాషా తాజుద్దీన్ మరియు పట్టణ ముస్లిం ఐక్యవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్టాఫీసు ద్వారా విద్యార్థులకు 6 వేల స్కాలర్షిప్ పథకం

**గుడివాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** దీన దయాల్ స్పర్ష్ యోజన 2024 ద్వారా పోస్టల్ శాఖ విద్యార్థులకు 6000 రూపాయల వరకు స్కాలర్షిప్ ఇస్తుందని.. ఇందు కొరకు విద్యార్థుల నుండి అప్లికేషన్లు ఆహ్వానిస్తున్నామని, అలాగే విద్యార్థుల ఎంపిక కాంపిటేటివ్ ఎగ్జాం ద్వారా చేయబడుతు ందనీ ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు నెలకు 500 చొప్పున ఒక సంవత్సరం పాటు పోస్టల్ శాఖ ఉచితంగా రు .6000/- స్కాలర్షిప్ మంజూరు చేస్తుందని గుడివాడ పోస్టల్ డివిజన్ సూపర్డెంట్ శ్రీ చల్లా. అప్పారావు గారు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయా సంబంధిత స్కూల్ యాజమాన్యం లేదా హెడ్మాస్టర్ ద్వారా ఈ స్కాలర్షిప్ కు విద్యార్థులు అప్లికేషన్ చేసుకోవచ్చని వారు తెలియజేసినారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 8247488868 లో సంప్రదించవచ్చునని వారు తెలియజేసినారు.

# "ఆంధ్రకేసరి" కి మున్సిపల్ కమీషనర్ నివాళి..



**గుడివాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి ని స్మరించుకొని.. గుడివాడ గౌరవ మునిసిపల్ కమీషనర్ జి.బాల సుబ్రహ్మణ్యం, మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ డి.టీ.వి.కృష్ణ రావు లు టంగు టూరి ప్రకాశం పంతులు గారి చిత్రపటా నికి పూల మాల వేసి ఆయన చేసిన కృషిని గుర్తుచేస్తూ, గుడివాడ పురపాలక సంఘ కార్యాలయము నందు ఏర్పాటు చేసిన కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారి తూటాలకు ఎదురొడ్డి నిలిచి తెలుగువారి సత్తాను చాటిన ధీరోదాత్తుడు, ధైర్యశాలి ప్రకాశం పంతులని కొనియాడారు. ఆయన న్యాయవాదిగా సంపాదించిన వందలాది రూపాయలను ప్రజాసేవకే వినియోగించారనీ పేర్కొన్నారు. అలాగే ఇతర పురపాలక సిబ్బంది, తదితరులు కూడ ఈ కార్యక్రమము లో పాల్గొని నివాళులు అర్పించారు.

# జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024: "చంద్రుని తాకేటప్పుడు జీవితాలను తాకడం"



**గుడివాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వర రావు (స్వయంప్రతిపత్తి) కళాశాలలో భారత తొలి అంతరిక్ష దినోత్సవాన్ని 23/08/2024 న ఇస్రో అధికారిక వెబ్ సైట్ నుండి విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. ఈ వేడుక అంతరిక్షం మరియు చంద్రయాన్-3 యొక్క అద్భుతాలను తెలియజేస్తు అంతరిక్ష అన్వేషణపై ఆసక్తిని పెంచడం మరియు భవిష్యత్ తరంను శాస్త్రవేత్తలనుగా ప్రేరేపించడం లక్ష్యంగా అన్ని వయసుల వారికి సరదాగా మరియు విద్యా పరంగా ఆసక్తికరమైన అనుభవాలను అందించగల ప్రత్యేక కార్యక్రమంగా విద్యార్థులచే కొనియాడబడినది కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ కే.ఎస్. అప్పారావు తెలియచేసారు. అంతరిక్ష శాస్త్రం మరియు అన్వేషణ, అంతరిక్ష మిషన్లు, భవిష్యత్తు ప్రాజెక్టులు మరియు అంతరిక్ష పరిశోధన ప్రపంచవ్యాప్త సవాళ్లను ఎలా పరిష్కరిస్తుందో అన్న విషయములపై ప్రముఖ ఇస్రో నిపుణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా।। పి.జె.ఎస్.కుమార్, కళాశాల ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, భౌతిక శాస్త్ర విభాగం అధిపతి కె. అనిల్ కుమార్, భౌతిక శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ ఆర్.ఎన్.ఎ. ప్రసాద్, బి. శ్రీదేవి, కె. రూప, బి. దివ్య, ఇతర విభాగ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండ.. పోలీసు వారిచే యువతకు అవగాహన



**గుడివాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు గుడివాడ టూ టౌన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ చిన్ని నాగ ప్రసాద్ స్థానిక చౌదరి పేటలో వున్న ప్రభుత్వ ఐ.టి.ఐ కాలేజీ నందు విద్యార్థులకు గంజాయి మరియు డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఇన్స్పెక్టర్ చిన్ని నాగ ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాలు వలన యువత నాశనం కాకుండా ఉండటం కోసం కృష్ణాజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టీమ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో గంజాయి రవాణా చేసేవారిని గంజాయి మత్తు పదార్థాలు సేవించే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అదేవిధంగా గంజాయి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.. ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వాటి ద్వారా పర్యవేక్షణ మరింత పెంచుతామని తెలియజేశారు. అనవసరమైన కేసుల్లో ఇరుక్కుని జీవితాల్ని నాశనం చేసుకోవద్దని యువతను ఉద్దేశించి మాట్లాడారు. అలాగే ట్రాఫిక్ నియమాలు, పిఓసిఎస్ఓ చట్టం, సైబర్ నేరాలు వంటి వాటి పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో గుడివాడ సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఈ. రమణమ్మ, ఐటిఐ కాలేజీ ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# టీ-హబ్ సందర్శించిన వీసీ




**కాకినాడ,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** జెఎన్టియుకె విద్యార్థులకు ఉపాధి కల్పన మరియు వ్యవస్థాపకతను పెంపొందించేందుకు గాను హైదరాబాద్ లోని వ్యాపార ఇంక్యుబేటర్ మరియు ఇన్నోవేషన్ మధ్యవర్తి అయిన టి-హబ్ మరియు టీ-వర్క్స్ ను ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్. మురళీకృష్ణ సందర్శించి టి-హబ్ సిఇఓ శ్రీనివాసరావు మహంకాళి మరియు ఇతర ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్. మురళీకృష్ణ మాట్లాడుతూ ఇన్నోవేషన్ & ఎంటర్ప్రెన్యూర్షిప్ ను ఉపయోగించుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో ఉన్న సవాళ్లను అధిగమించవచ్చునన్నారు. ముఖ్యంగా జెఎన్టియుకె పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు వ్యవస్థాపకత మరియు ఆవిష్కరణలను సులభతరం చేయడంలో కీలకపాత్ర పోషించాలనే లక్ష్యంతో టీ-హబ్ను సందర్శించడం జరిగిందన్నారు. స్టార్టప్లు, ఆవిష్కరణలను పెంపొందించడంలో టి-హబ్ యొక్క కార్యాచరణ నమూనా, విజయ కారకాలను అర్థం చేసుకోవడంతో పాటు వనరులు, జ్ఞాన సముపార్జనకు జెఎన్ టియుకె మరియు టి-హబ్ సహకరించుకునేలా చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు మెంటార్షిప్ ప్రోగ్రామ్లను అభివృద్ధి చేయడంతో పాటు అనుబంధ కళాశాలల్లో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటుచేస్తామన్నారు. పాఠశాల మరియు కళాశాలల విద్యార్థుల కోసం హ్యాకథాన్లు, ఆవిష్కరణ పోటీలను నిర్వహించడంతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా వారిని ప్రోత్సహిస్తామన్నారు. దీనికి అనుగుణంగా జెఎన్టియు-కె పరిధిలోని ఎంపిక చేసిన కళాశాలల్లో పైలట్ ప్రోగ్రామ్లను ప్రారంభిస్తామన్నారు.ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్ జి. మురళీకృష్ణ వెంట టి-హబ్ ప్రతినిధులు సిహెచ్.సాయి అభినయ్, జి.రవి, డా.సిహెచ్. యువరాజ్, టి. శిరీష, జి.స్వరూపలు ఉన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మందికి మేలు జరిగింది - ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**కూకట్ పల్లి,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీకి చెందిన రజితకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా మంజూరైన రెండు లక్షల ముప్పై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతోమంది పేదలకు ఆర్థిక సహాయం లభించింది అన్నారు. అదేవిధంగా ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే గాంధీ పునరుద్ఘాటించారు . ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఎమ్మెల్యే గాంధీ ఈ సందర్భంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి,కాశినాథ్ యాదవ్ ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధి



**కంకిపాడు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడు మరియు గ్రామాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంచార్జ్ అధికారి సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ సభలో పాల్గొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈడుపుగల్లు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలు పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులు ద్వారా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటుకు ప్రాధాన్య ఇస్తూ ప్రణాళిక బద్ధంగా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి పూర్తిగా గాలికి వదిలేసారని ఆరోపించారు. గత ప్రభుత్వం అభివృద్ధిని మరిచి కక్ష సాధింపులే ధ్యేయంగా పనిచేసింది అన్నారు. పోలీస్ శాఖ వారిని శాంతి భద్రతలు, మత్తు పదార్థాలు నివారణకు చర్యలు చేపట్టనీయకుండా,ప్రతిపక్షాల నోరులు నొక్కి కేసులు పెట్టడానికి వాడుకున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి ఇంద్రాణి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీడీవో ఉదయభాస్కర్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి



**కంకిపాడు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడులో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సోషల్ వర్కర్ యలమంచిలి కిషోర్ బాబు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ బాబు మాట్లాడుతూ సుమారు 20 గ్రామాలకు కుదలి అయిన కంకిపాడు గ్రామానికి వర్తక,వాణిజ్య, రైతు వారీ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి వస్తుంటారు. మూత్ర విసర్జనకు కంకిపాడు బస్టాండ్ మరియు బహిరంగ ప్రదేశాలు తప్ప ఎటువంటి సౌకర్యాలు లేవు నిత్యం వేలమంది వచ్చి వెళ్లే వారి కోసం ముఖ్యంగా మహిళలను దృష్టిలో ఉంచుకొని పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. దీనికి సర్పంచ్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

# ఎస్సై సతీష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన తెదేపా నేతలు



**జి.కొండూరు,ఆగష్టు 23 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండలం పోలీస్ స్టేషన్ ఎస్సై గా కొత్తగా భాద్యత లు చేపట్టిన కొమ్మిన సతీష్ కుమార్ ని స్థానిక తెదేపా నాయకులు మర్యాదపూ ర్వకంగా కలిశారు.అనంతరం ఎస్ఐ కి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.మైలవరం నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అంకెం సురేష్, తెలుగు మహిళ విజయవాడ పార్లమెంటు కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని, జి.కొండూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పజ్జూరు వెంకటేశ్వరరావు (బుల్లి) తదితరులు ఎస్సైని కలిశారు.

# స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి ప్రణాళికలు

(మొదటిపేజీ తరువాయి)

వేసి ఘన నివాళులు అర్పించి గ్రామసభను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక (వీడీపీ)తో పాటు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు గుర్తించిన పనుల ఆమోదానికి సభలో చర్చ జరిగింది. ఇంతవరకు చేపట్టిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులను కూడా అధికారులు గ్రామ ప్రజలకు వివరించారు. ఉపాధి హామీ పథకం వేతనదారుల హక్కులను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హక్కులు, రాజీలేని అంశాలు, ఉపాధి హామీలో చేపట్టే పనులు, సామాజిక తనిఖీ ప్రాధాన్యత తదితర విషయాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి, తద్వారా నాణ్యమైన పనుల ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందన్నారు. నాలుగు గోడల మధ్య కాకుండా సానుకూల వాతావరణంలో ప్రజా భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక అనేది ప్రజలందరి భాగస్వామ్యంతో జరగాలి అనే ఉద్దేశంతో ఈ సభలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. కుళాయి కనెక్షన్లు, మరుగుదొడ్డి సుదపాయం వంటి వ్యక్తిగతంగా కుటుంబాలకు మేలుచూకూర్చే పనులు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణ, సిమెంటు రహదారులు, ఘన వ్యర్థాల నిర్వహణ, మండల కేంద్రాలకు అనుసంధాన రహదారుల నిర్మాణం వంటి ఉమ్మడి లబ్ధిని చేకూర్చే పనులు వంటివి చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికల రూపకల్పనకూ ఈ గ్రామసభలు వేదికలుగా నిలుస్తాయన్నారు. మౌలిక వసతుల పరంగా ప్రస్తుతం గ్రామంలో ఏమేమి ఉన్నాయి? భవిష్యత్తు అవసరాల కోసం ఏమికావాలి? అని తెలుసుకోవడం కోసం, నాలుగైదు సంవత్సరాల్లో ఏం చేయాలనే దానిపై ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించుకునేందుకు ఈ గ్రామసభలు దోహదం చేస్తాయన్నారు.

**దశల వారీగా అన్ని గ్రామాలూ, నియోజకవర్గ అభివృద్ధికి కృషి - శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్**

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో వారి దార్శనికతకు అనుగుణంగా గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా గ్రామసభలను పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతోందని.. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని గ్రామాలూ, తమ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం నియోజకవర్గానికి రూ. 22.50 కోట్లు కేటాయించడం జరిగిందని, ఒక్కో మండలానికి రూ. 5 కోట్లు చొప్పున కేటాయించినట్లు తెలిపారు. గ్రామాలకు అవసరమయ్యే సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి పనులను ముందుకుతీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని.. 2024-29లో దశల వారీగా పనులను పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరం మేరకు డీఎంఎఫ్, సీఎస్ఆర్ తదితర నిధుల సహకారంతోనూ మరిన్ని పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు ఇతర నిధులను ప్రజా భాగస్వామ్యంతో సమర్థవంతంగా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సభలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, గ్రామ సర్పంచ్ కె.దేవమాత, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జె.సునీత, డీపీవో ఎన్వీ శివప్రసాద్ యాదవ్, స్థానిక నేతలు, ప్రజలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తదితరులు హాజరయ్యారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188